క్లుప్తంగా

సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్ వెంకన్న

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) విభాగం ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ వెంకన్న శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందించారు. విధులు సక్రమంగా నిర్వర్తించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సీపీ సూచించారు.

నేడు ఉద్యోగుల సమావేశం

హన్మకొండ అర్బన్: హనుమకొండ మాస్టర్‌జీ డిగ్రీ కాలేజీలో ఆదివారం తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే సమావేశంలో ఉద్యోగుల సాధారణ బదిలీలపై అనుమానాలను నివృత్తి చేసుకునేలా అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఉద్యోగులు హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్సీ సారయ్యకు అభినందనల వెల్లువ



రామన్నపేట : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కాంగ్రెస్ పార్టీలోకి చేరిన సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు శనివారం సారయ్యను కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్‌లో క్రియాశీలక పాత్ర పోషించిన సారయ్య తిరిగి పార్టీలోకి రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

అంజన్నకు పూలతో అలంకరణ

కాజీపేట: నగరంలోని 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణ ముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు పూలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పూజారులు అంజన్నకు గణపతి హోమం జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు ఆశీర్వాదం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పూజల్లో భాగస్వామ్యం పంచుకున్నారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి అభినందనలు



వరంగల్ స్పోర్ట్స్ : ఈ నెల 14 నుంచి 25 వరకు అమాన్ దేశంలోని జోర్డాన్‌లో జరగనున్న ఏషియన్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ క్రీడాకారుడు శివాజీ ఎంపికయ్యాడు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను క్రీడాకారుడు శివాజీ, డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్, డీఎస్ఏ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్ మర్యాద పూర్వకంగా కలిశారు. శివాజీని కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ రాధికగుప్తా శాలువాతో సత్కరించి అభినందించారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలి



కాజీపేట అర్బన్ : మండలంలోని న్యూశాయంపేటలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు తక్షణమే కేటాయించాలని న్యూశాయంపేటలో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు తెలిపారు. 343 సర్వే నెంబర్‌లో 600 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి ఎవరికీ నాటి ప్రభుత్వం కేటాయించలేదని, నేటి ప్రభుత్వమైన చొరవ చూపి కేటాయించాలని చర్చించారు. కార్యక్రమంలో సీపీఎం, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు సారంగపాణి, ప్రసాద్, శ్రీనివాస్, సురేందర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం



హన్మకొండ కల్చరల్ : వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరిదేవీ దేవాలయంలో ఆషాఢశుద్ధ పాడ్యమి శనివారం శాకంబరీ నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఝెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి గణపతి సుబ్రమణ్యం సూర్య నర్సింహా శివ బాలలలిత రాజశ్యామల ఆవరణార్చనలు, లలిత సహస్రనామ, సౌందర్యలహరి పారాయణం, హారతి, భోజన ప్రసాదాల వితరణ, సాయంత్రం అర్చనలు జరిగాయి. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప నాయకుడు

● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని



హన్మకొండచౌరస్తా : జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



దేశాయిపేట : జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాల వేస్తున్న సురేష్‌జోషి

హన్మకొండ చౌరస్తా: మొదటిసారిగా 1957లో దళిత, గిరిజనులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లను అమలులోకి తీసుకొచ్చిన గొప్ప నాయకుడు బాబూ జగ్జీవన్‌రాం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆహారమంత్రిగా దేశాన్ని తీవ్ర దుర్భిక్షం కోరం నుంచి తప్పించి మొదటిసారి ఆహార విప్లవం నడిపించిన ఘనత బాబూ జగ్జీవన్‌రాందే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈవీ శ్రీనివాస రావు, బంక సరళ, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, పులి అనిల్, నాయిని లక్ష్మారెడ్డి, సుంచు అశోక్, నాగరాజు, స్వామిచరణ్ కార్యకర్తలు, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

హన్మకొండ: దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని ఎమ్మార్పీఎస్–టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని జరుపుకున్నారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జన్ను సంజీవ్, మంద రాజశేఖర్, తీగల సుధన్, అనిల్ కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

కాజీపేట రూరల్ : డీజిల్‌కాలనీ సెంటర్‌లో శనివారం ఆది జాంబవ అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి జరిగింది. షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్, రామగిరి శ్రీనివాస్, అరుంధంతి సంఘం నాయకులు బొజ్జపల్లి సింగారావు, వి. రా జేందర్, లక్ష్మణ్, తిరుపతి, గోపి, నద్దునూరి రాజాలక్ష్మణ్, హరిప్రసాద్, పాల్గొన్నారు.

హసన్‌పర్తి: నగరంలోని 1వ డివిజన్ ముచ్చర్లలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, రాజేష్,శ్రవణ్, కుమార్ రెడ్డి, సతీష్, సమ్మయ్య సోమయ్య,రాజు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

దేశాయిపేట: భారత దేశ స్వరాజ్య ఉద్యమంతో పాటు, ఈ దేశ పునర్నిర్మాణానికి కృషి చేసిన మహానాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌కుమార్‌జోషి అన్నారు. తెలంగాణ దళిత సేన వ్యవస్థాపకులు జన్ను అనిల్ కుమార్, కొత్తూరి యాకేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు జన్ను ఆదాం, కోర్నెల్, టీచర్ వేణు, సురేందర్, విజయరావు, నగేష్, బాబు, చిన్నా, రాజు, కిషన్, సురేష్, కుమార్ యాదవ్, రాము, అశ్విన్, భాను చరణ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



రైల్వే నాయకులతో మాట్లాడి తెలుసుకుంటున్న డివిజన్ సెక్రటరీ రవీందర్

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్‌డివిజన్ రైల్వే శాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న రైల్వే కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల నాయకులతో కలిసి రైల్వే ఆస్పత్రికి వెళ్లి అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాత రైల్వే ఆస్పత్రి, కొత్తగా నిర్మించిన సబ్ డివిజన్ ఆస్పత్రికి వెళ్లి అక్కడ సమస్యలు తెలుసుకొని రైల్వే ఆస్పత్రి సీనియర్ ఎం.ఎస్.డాక్టర్ ఐ.నిరంజన్‌రావును కలిశారు. కంటి వ్యాధుల కోసం, సూపర్ స్పెషాలిటి వైద్యం కోసం రెఫరెల్ ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకరావాలని, రోగుల కోసం క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సిబ్బంది ఉండేలా చూడాలని డాక్టర్ నిరంజన్ దృష్టికి తీసుకెళ్లి వివరించారు. రైల్వే మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల సెక్రటరీలు, చైర్మన్లు పాల్గొన్నారు.

ప్రణయన్న ఆశయాల సాధనకు కృషి

● మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం



హన్మకొండ : ప్రణయ్‌భాస్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ/కాజీపేట రూరల్/హన్మకొండ చౌరస్తా: మాజీ మంత్రి దాస్యం ప్రణయన్న ఆశయాల సాధనకు కృషి చేస్తున్నామని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమకారుడు దాస్యం ప్రణయ్ భాస్కర్ జయంతి, వర్ధంతిని నిర్వహించారు. హనుమకొండ లెప్రస్ కాలనీ, ఫాతిమానగర్‌లోని హౌస్ ఆఫ్ జాయ్‌లో పండ్ల పంపిణీ, సుబేదారి వడ్డేపల్లి చౌరస్తాలోని ప్రణయ్ మార్గ్ వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 10వ డివిజన్ పరిధి పద్మాక్షికాలనీలోని ఆనందనగర్ (లెప్రసీకాలనీ)లో పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తాళ్ళపల్లి జనార్ధన్, పులి రజనీకాంత్, సోదా కిరణ్, ఉడుతల సారంగపాణి, అశోక్, నయిముద్దీన్, మేకల బాబురావు పాల్గొన్నారు. కాజీపేటలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు ఆధ్వర్యంలో నార్లగిరి రమేష్, కనకరాజ్, సోని, శివ, మర్యాల కృష్ణ, నయీంజుబేర్, వేణు, మహమూద్, నరేశ్, సయ్యద్ సర్వర్, మతిన్, యాకూబ్, రాబట్, సునంద్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ ఖలీల్, నాయకులు నయీమొద్దీన్, రఘువరణ్, హరికృష్ణ, శోభన్, గోపి పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు

హసన్‌పర్తి: మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల్లో శనివారం ఇండస్ట్రీ–ఇనిస్టిట్యూషన్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమల్‌రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఫార్మసీ, బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. పరిశ్రమల్లోని నిపుణులతో మమేకమై వారి అనుభవంతో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ప్లేస్‌మెంట్‌ల్లో ప్రయోజనం చేకూర్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. మల్టీనేషనల్ కంపెనీ అసోసియేట్ డైరెక్టర్ గణేష్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ కేరీర్‌ల కోసం రిక్రూట్‌మెంట్ ప్రక్రియ అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానం గురించి వివరించారు. వివిధ పారిశ్రామిక రంగాల్లో తాజా సాంకేతిక పరిణామాలను ప్రస్తావించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు హరి, ప్రశాంత్, సూరజ్ శర్మ, ఆదిత్యకుమార్ పరిశ్రమ నిపుణులు నీరజా కేసరి, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

కేయూ పాలక మండలి సభ్యుడికి సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడిగా నియమితులైన యూనివర్సిటీ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్యులు బి.సురేష్‌లాల్‌ను వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు శనివారం క్యాంపస్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి , పూలబొకేను అందించి అభినందించారు. ఈ సందర్భంగా వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ యూనివర్సిటీలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు మౌళిక సదుపాయాల కల్పనకు కృషిచేయాలని సురేష్‌లాల్‌ను కోరారు. సొసైటీ బాధ్యులు ప్రొఫెసర్ విజయబాబు, శ్రీనివాస్, సుధాకర్ రావు, రాజమోహన్, పురుషోత్తమ్ పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉన్నత ఉద్యోగం



విద్యార్థికి జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్

మామునూరు : నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నతమైన ఉద్యోగం లభిస్తుందని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్ అన్నారు. విద్యార్థులు రూ.10 లక్షల వేతనంతో బహుళ జాతీయ కంపెనీకి ఎంపికవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. శనివారం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో రూ.10 లక్షల వేతనంతో బహుళజాతీయ కంపెనీకి ఎంపికైన ఐదుగురు విద్యార్థులకు ఆయన మెమోంటో అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులు విద్య, ప్లేస్‌మెంట్‌లో నైపుణ్యం కోసం ప్రయత్నిస్తుందన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటాగా సైన్సెస్ బ్రాంచ్‌లకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఫ్యాక్ట్‌సెట్ రీసెర్చ్ సిస్టమ్స్ ఇంక్ నార్వాక్, యూఎస్‌ఏ ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న ప్రముఖ గ్లోబల్ అమెరికన్ ఫైనాన్షియల్ డేటా, సాఫ్ట్‌వేర్ కంపెనీతో ప్రతిష్టాత్మకమైన ప్లేస్‌మెంట్లతో ఏడాదికి రూ.10 లక్షల కంటే ఎక్కువ జీతం ప్యాకేజీ పొందడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ప్రసాద్ రావు బర్కత్, డాక్టర్. టి. తిరుపతిరావు, డాక్టర్ ఎం. శశిధర్, సీహెచ్ రాజు పాల్గొన్నారు.

ఫీటల్ మెడిసిన్ సెంటర్‌లో అరుదైన చికిత్స



చికిత్స అందించిన వైద్య బృందం

ఎంజీఎం/వరంగల్ : అంజియో ఎంబోలైజేషన్ పద్ధతి ద్వారా గర్భిణికి కోరియాంజియోమా అనే కణితికి రాష్ట్రంలోనే తొలిసారిగా చికిత్స అందించి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడినట్లు ఫీటల్ మెడిసిన్ వైద్యులు శిరీషరెడ్డి తెలిపారు. రంగశాయిపేటకు చెందిన 24 ఏళ్ల యువతి హారిక 27 వారాల గర్భిణిగా ఉండి కడుపునొప్పితో గైనకాలజిస్టు వరలక్ష్మిని సంప్రదించింది. స్కానింగ్ కోసం తమ వద్దకు రాగా సుమారు 10 సెంటిమీటర్ల కణితి గర్భంలో ఉందని గుర్తించినట్లు తెలిపారు. దీంతో గర్భంలో ఉన్న శిశువుకు రక్తం సరఫరా తగ్గడం, గర్భస్థ శిశువు గుండెపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్కానింగ్‌లో గుర్తించినట్లు తెలిపారు. ఇందులో 27 వారాలకే ప్రసవం చేసి ఎన్ఐసీయులో ఉంచడం ఇందుకు రూ. 15 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. రెండో విధానంలో గర్భసంచి పక్కనే కణితి రక్తనాళాలకు ఎంబోలైజేషన్ పద్ధతిలో కణితి పరిమాణం తగ్గించడం ఇందుకు రూ. 50 వేలు ఖర్చు అవుతుందని చెప్పి 37 వారాల వరకు గర్భిణీని పరీక్షించుకుంటూ ఈనెల 5న ప్రసవం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం శిశువు 2.75 కిలోలతో ఆరోగ్యం ఉందని ఇలాంటి సేవలు భారతదేశంలో మూడోది కాగా, తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిదని వైద్యులు తెలిపారు.

ట్రాఫిక్ సీఐని కలిసిన చిరువ్యాపారులు



ఖిలా వరంగల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణను శనివారం తూర్పుకోటకు చెందిన మార్కెట్ మాజీ డైరెక్టర్ సంగరబోయిన చందర్ మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రామకృష్ణకు ఆయన పుష్పగుచ్చం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సీఐని కలిసిన వారిలో చిరువ్యాపారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గజ్జెల లింగమూర్తి, చిరువ్యాపారులు ఎండీ షఫీ, ఎండీ.సయ్యద్ తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న దాతలు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మంచన భవాని సంతోష్, భిక్షపతిల సహకారంతో 600 నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థ కార్మిక సంఘం అధ్యక్షుడు కేవీ జాన్సన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇక ముందు ఎలాంటి అవసరం ఉన్న సమకూరుస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు పీటీ డ్రెస్ నిమిత్తం 100 టీ షర్ట్‌లకు రూ. 15 వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నరేందర్, కాశీ విశ్వేశ్వర్‌రావు, రఘునందన్, సురేశ్, పెండ్లి కృష్ణమూర్తి, పూల్యానాయక్, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అరుణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చెట్లను రక్షించడం సామాజిక బాధ్యత

● హనుమకొండ డీఎఫ్ఓ లావణ్య



కాజీపేట రూరల్: మొక్క నాటుతున్న లావణ్య



వరంగల్: సీకేఎంలో మొక్క నాటుతున్న విద్యార్థులు

కాజీపేట రూరల్ : సమాజంలో భవిష్యత్ తరాల కోసం చెట్లను పరిరక్షించడం ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని డిస్ట్రిక్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్ఓ) బి.లావణ్య అన్నారు. స్థానిక సేయింట్ గ్యాబ్రియల్ స్కూల్‌లో శనివారం ప్రిన్సిపాల్ బ్రదర్ పి.ఆంటోని ఆధ్వర్యంలో జరిగిన వనమహోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు మొక్కల పెంపకం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. ఈ ఏడాది స్కూల్ కాబినెట్, ఎన్‌సీసీ విద్యార్థులతో 200 మొక్కలు నాటినట్లు బ్రదర్ ఆంటోని తెలిపారు. ఆర్వో శ్రీనివాసన్, డిప్యూటీ ఆర్వో రంజిత్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులు, పాల్గొన్నారు.

కాశిబుగ్గ : వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బాల జ్యోతి హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణి, హెచ్ఎం దేవిక పిలుపునిచ్చారు.

వరంగల్: పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకంతోనే సాధ్యమని అందుకే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని రక్షించాలని కేయూ కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ మల్లం నవీన్ అన్నారు. సోమవారం సీకేఎం కాలేజీలో నిర్వహించిన ఏక్ పేడ్ మాకే నామ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు, డాక్టర్ ధర్మారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, కెప్టెన్ డాక్టర్ పి.సతీష్, లైబ్రేరియన్ అనిల్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

కాజీపేట అర్బన్ : కాలుష్య నివారణకు దేశవ్యాప్తంగా చేపడుతున్న గో గ్రీన్ ఇండియా మిషన్ ప్రోగ్రాంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని శ్రీ చైతన్య విద్యాసంస్థల జీఎం నాగేందర్ తెలిపారు. మండలంలోని కడిపికొండ శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన వనమహోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా నాగేందర్ పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. డీజీఎం చేతన్, ఏజీఎం రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ జోన్ అకాడమి కోఆర్డినేటర్ శివకోటేశ్వర్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కుక్కకు టీకా వేస్తున్న వెంకటనారాయణ

హన్మకొండ: జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా పశు వైద్యాధికారి కె.వెంకటనారాయణ అన్నారు. శనివారం వడ్డేపల్లి ప్రాథమిక పశువైద్య కేంద్రంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పెంపుడు జంతువులకు టీకాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవులు తమ అవసరాలు, ఆనందం, ఆహారం కోసం వివిధ రకాల జంతువులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఈక్రమంలో జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా.. వడ్డేపల్లి పశు వైద్య కేంద్రంలో మొత్తం 137 పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. పశు వైద్య, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్, జంతువుల రోగనిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకురాలు నాగమణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కేసీఆర్ పగటి కలలు మానాలి

కేయూ క్యాంపస్: తెలంగాణలో తొమ్మిదన్నరేళ్ల పాటు దురంహంకార, అవినీతి పాలనను కొనసాగించిన కేసీఆర్ ఇక పగటికలలు మానాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యాకేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో ప్రజాగ్రహానికి గురై పదవి కోల్పోయిన కేసీఆర్ వాస్తవాలను గుర్తించడం లేదన్నారు. ప్రజల సొమ్మును దోచుకున్న రాజకీయ నాయకులకు శిక్ష విధించకుంటే మున్ముందు ప్రజా స్వామ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. పూలే ఆశయసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్, ఉమ్మడి వరంగల్ జిల్లా పాస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

వివాహితను భర్తకు అప్పగింత

ఖిలా వరంగల్: భర్తతో గొడవ పెట్టుకుని కుమార్తెను వదిలేసి ఇంటి నుంచి వెళ్లిన ఓ వివాహిత ఆచూకీ కనిపెట్టి శనివారం తన భర్తకు అప్పగించినట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన బోడ మోహన్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 3న భర్త మోహన్‌తో గొడవ పడిన ఉమ కుమార్తెను వదిలేసి ఇంటినుంచి వెళ్లిపోయింది. భర్త ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఆమె ఆచూకీ టెక్ టీం సహకారంతో కనిపెట్టి ఉమను శనివారం తన భర్తకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

చట్టాలను వెంటనే రద్దు చేయాలి

ఖిలా వరంగల్: ప్రజావ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. శనివారం శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా కల్పించిన ప్రాథమిక హక్కులను భంగం కలిగించే విధంగా చట్టాలను రూపొందించడం నియంతృత్వ పోకడలకు అద్దం పడుతున్నారని డిమాండ్ చేశారు.

ఆస్పత్రిలో చోరీకి యత్నం

వరంగల్ చౌరస్తా : వరంగల్ వెంకట్రామా జంక్షన్‌కు సమీపంలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో దొంగతనానికి పాల్పడి యత్నించి విఫలమైన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వెంకట్రామా జంక్షన్‌కు అతి దగ్గరగా ఉన్న డాక్టర్ జీ.ప్రమోద్‌కుమార్ కుటుంబ సభ్యులతో వారం రోజులు టూర్‌కు వెళ్లారు. రెండు రోజులుగా ఆస్పత్రి మూసివేసి ఉండటంతో దొంగలు క్లినిక్ అద్దాలు పగులగొట్టి, షెట్టర్ల తాళం తీసేందుకు యత్నించారు. పెద్దగా శబ్దాలు రావడంతో ఎదురుగా ఉన్న సంరక్ష ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు అక్కడికి చేరుకోవడంతో దొంగలు పరారయ్యారు. వైద్యుడి తండ్రి పెంచలయ్య, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మీసాల ప్రకాశ్ అందించిన సమాచారంతో మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసుపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

వరంగల్ అర్బన్ : బల్దియా ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బల్దియా ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ కృష్ణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇటీవల ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారెడ్డికి సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్ కలిసి పుష్పగుచ్ఛం అందచేసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, తిరుమల్‌రావు కమిషన్ అమలు చేయాలని కేవీపీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ చలపతిరావుకు విన్నవించి వినతిపత్రంను సమర్పించారు.

కేయూలో క్లీన్ అండ్ గ్రీన్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల వద్ద లైబ్రరీ ఆవరణలో, దూరవిద్యాకేంద్రం ప్రాంతంలో సంబంధిత ఉద్యోగులు, వివిధ విభాగాల వద్ద విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. దూరవిద్యాకేంద్రం వద్ద డైరెక్టర్ ఆచార్య విరాంచంద్రం పాల్గొన్నారు. అలాగే హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి పర్యవేక్షణలో పలువురు ఉద్యోగులు,విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రిటైర్‌మెంట్ ప్రయోజనాలు పెంచాలి

హన్మకొండ: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్‌మెంట్ ప్రయోజనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద అంగన్‌వాడీ టీచర్స్, ఆయాల రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు.

బీఆర్ఎస్ నాయకుడిపై కేసు

హసన్‌పర్తి: 55వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సాయికుమార్‌పై శనివారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వంశీ గోపాలపురంలో కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం వంశీకి సాయికుమార్ తండ్రి మ ధ్య చిన్న గొడవ చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన సాయికుమార్ కర్రతో వంశీపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ చౌరస్తా: ఉచిత చేపపిల్లల పంపిణీకి బదులుగా మత్స్య సొసైటీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని టీఎంకేఎంకేఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. హనుమకొండలో మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో డీఎఫ్ఓ డాక్టర్ విజయభారతికి వినతిపత్రం అందజేశారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి

కాశిబుగ్గ: ఓ సిటీలోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలోని స్టేడియంలో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయని వాటిని అరికట్టాలని జిల్లా యువజన క్రీడల అధి కారి సత్యవాణి కోరారు. శనివారం ఆమె మిల్స్ కాలనీ సీఐకి ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఓ సిటీ స్టేడియంలో కొందరు ఆకతాయిలు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ.. క్రీడాకారులను ఇబ్బందులకు గు రిచేస్తున్నారన్నారు. క్రీడాకారులు ప్రాక్టీస్ చేసే సమయంలో వెకిలి చేష్టలు చేస్తురని, రాత్రి సమయంలో స్టేడియంలో ఉంటూ.. మద్యపానం సేవిస్తూ.. వాచ్‌మెన్ అడ్డుకుంటే దాడులకు దిగుతున్నారన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే తాము లోకల్ అని ఏం చేస్తారో చేసుకోండంటూ దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో స్టేడియం వైపు పె ట్రోలింగ్ చేయాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.